# మళ్ళా రాత్రి

దే. సావిత్రి

చుట్టూ చీకటిగా వుంటుంది. ఎక్కడా ఎవరూ ఉండరు. నిద్రగన్నేరు చెట్టుకింద ఎవరో ఒకవ్యక్తిమాత్రం నుంచుని వుంటాడు. పరిచితులుకూడా అప్పుడు ఆ ముఖాన్ని పోల్చుకోవటంకష్టం. నిప్పుల్లా మెరుస్తూన్న కళ్లు తప్ప మరేం స్పష్టంగా కనపడవు. ఎవరో ఇంచుమించు నలభై ఏళ్ళమనిషి మార్గాయాసంవల్ల ఆ చెట్టుకింద నుంచున్నాడేమో అనుకుంటాం. మనిషి చెట్టుకు చెయ్యి ఆన్చుకుని దగ్గుతూ, పొగవదుల్తూ ఆకాశంవేపు చూస్తూంటాడు. సగం కాల్చినసిగరెట్‌ని సరిగ్గా రోడ్డుమీదపడేట్టు విసిరేస్తాడు. ఒకక్షణం ఆ సిగరెట్ చూస్తూ నుంచుంటాడు. ఇంకా వస్తూన్న పొగని అలా పరీక్షగా చూస్తూంటాడు. హఠాత్తుగా కొమ్మ ఫెళఫెళా విరుగుతూన్నట్టు ఫక్కున నవ్వుతాడు.

కొమ్మమీద అప్పుడే మేల్కొన్న పక్షి మరో కొమ్మమీద వాలుతుంది.

ఇక ఒకక్షణం అక్కడుండడు. పారేసిన సిగరెట్‌ని మళ్ళా చేతపుచ్చుకుని రోడ్డుమధ్యనడుస్తూంటాడు. ఊగుతూ జోగుతూ నడుస్తాడు. అప్పుడు దీపాలవెల్తురులో మనం ఆ మనిషిని పోల్చుకోగలం. ముఖాన్ని స్పష్టంగా వర్ణించగలం. ముఖం ముడుతలుపడి ఉంటుంది. జుట్టు నెరిసిపోయి రేగిపోయి ఉంటుంది. రోడ్డుమీద దుమ్మంతా గుడ్డలమీదనేఉండటంవల్ల చూడ్డానికి సర్వాసహ్యంగా ఉంటాడు. చూడ్డంతోనే అనుకుంటాం ఎవడో త్రాగుబోతని.

త్రాగుబోతు ఊగుతూ, జోగుతూ నడుస్తూ ఓ గుమ్మంముందు ఆగుతాడు.

ఇక్కడోమాట చెప్పటంఅవసరం. ఆ సమయంలో అపరిచితు లెవరేనా చూస్తే అతన్నితప్పకుండా ఎవడో దొంగైఉంటాడనే నిర్ణయించేసుకోవచ్చు. అతడు కేవలం త్రాగుబోతేగాని దొంగమాత్రంకాదు. మర్యాదస్తుడే. ఇంతక్రితంబాగా బ్రతికినవాడుకూడా. ఆమాటకొస్తే ఆయింటికిపెద్దకూడా అతనేఅని చెప్పకతప్పదు.

త్రాగుబోతు ఒక్కదఫా ఒళ్ళంతా విరుచుకుని తలుప దభదభా బాత్తాడు.

తలుపు తెరుచుకుంటుంది. ప్రక్కనే ఆమె వాడలిపోతూ నిలబడి ఉంటుంది.

మరోముఖ్యవిషయం. ఇంతక్రితం అంటే ఈ త్రాగుబోతే 'వెంకట్రావుగారూ!' అని సమర్యాదగా పిలబడే రోజుల్లో తలుపుప్రక్కన సీతమ్మ వాడలిపోతూ నిలబడేదికాదు. వచ్చీరావటంతోనే 'సీతా తలుపుతెరు!' అనేవాడు. సీత నవ్వుతూ తలుపుతెరిచేది.

కాని ఇప్పుడుమాత్రం ఆమె వాడలిపోతూ నుంచుంటుంది.

అతను చేతులురెండూ ద్వారబంధంమీదే ఉంచి ఆమెకేసి నిప్పులురాలుస్తూ చూస్తాడు.

"తలుపువేసుకుని ఏంచేస్తున్నావ్ వెధవమొహంనువ్వూ!"

కేవలం పిడుగుపడ్డట్టే అంటాడు. నిప్పులురాలుస్తూ చరచరా లోపలకుపోతాడు.

ఆమె కిక్కురుమనదు. తలుపు మూసేసి అతని ప్రక్కనే నిలబడుతుంది.

"పో, నీగదిలోకిపో! ఇక్కడెందుకూ ఆవెధవకూడా ఉన్నాడా? వాణ్ణిచూసే పొగరెక్కువైందినీకు. ఆ ఉద్యోగం ఆమూడువందలూ చూసే మురిసిపోతున్నావు, వాణ్ణీయింట్లోంచి తరిమేస్తే అప్పుడుగాని లొంగవునువ్వు. ఆమెకొంచంసేపు అలా దిగాలుగా అక్కడేనుంచుని భర్తకి అన్నం వడ్డించటానికి లోపలకుపోతుంది.

త్రాగుబోతు, పోనీ ఇక వెంకట్రావు అనే అందాం. అలా అక్కడే ఆకుర్చీలోనే నిద్రపోతాడు.

సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చేసరికి లేస్తాడు. ప్రక్కనే కాఫీ చల్లారిపోయి ఉంటుంది. నిద్రలోమత్తుకొస్తా వొదిలిపోతుందేమో ఆ చల్లారిన

కాఫీనే కిక్కురుమనకుండా తాగేస్తాడు. నేరుగా దొడ్లోకిపోయి ముఖం కడుక్కుని బట్టలుమార్చుకునిమళ్లీవచ్చి కూర్చుంటాడు.

సీతమ్మ ఎదురుగావచ్చి నిలబడుతుంది.

"ఎందుకు దిష్టిబొమ్మలా నాయెదుట నిలబడ్డావు?"

"వంటైంది. భోజనానికిరండి"

'భోజనానికేంగాని డబ్బేమన్నావుంటే ఇలా పడేయ్'

'అబ్బే, ఏంలేదే!'

'లేదూ, కొత్తచీర కొనుక్కోటాని కైతే వస్తుందేం!'

సీతమ్మ ఏంసమాధానం చెప్తుంది అలా అక్కడే దిగులుగా నిలబడిఉంటుంది. ఆమెఅలా మౌనంగా నిలబడటంచూస్తే వెంకట్రావుకు మరీ మండిపోతుంది. ఐనా ఏంచేస్తాడు? ఆమెదగ్గర మాత్రం ఏంవుంది ఇవ్వటానికి. ఒంటిమీదున్న నగలన్నీ ఇంతక్రితమే ఆమెని నానాబాధలూ పెట్టి లాక్కుపోయాడు. చిత్తుగా తాగేశాడు. ఇప్పుడామె నిరాభరణ. ఆఖరికి చేతులకి గాజులు కూడా లేవు.

ఆమె అలాగే మౌనంగా నిలబడివుంటుంది.

ఇంక చేసేదేంలేక వెంకట్రావు చుట్టూవున్న వస్తువుల్ని విసవిసా విసిరేసి ఆమెనో నాలుగుతన్ని అలాగే వెళిపోతాడు. మళ్లీప్రొద్దునేగాని కనిపించడు.

రోజూ ఇదేవరస. ఈసన్నివేశాన్నే రోజూ మనం ఆయింట్లోచూస్తాం.

నిజం చెప్పాల్సొస్తే ఈసన్నివేశాలమధ్య నలిగి హతమారిపోతున్నది ఒక్కర్తీ సీతమ్మే కాదు. కొడుకు గోపీకూడా.

గోడవెనకాలే నుంచుని జరుగుతున్న రాద్ధాంతాన్నంతావింటాడు. తండ్రిని చంపేద్దామన్నంత కోపంవచ్చినా ఆకోపాన్ని అలాగే అణిచేసుకుంటాడు. తల్లినిచూసే గోపీ తండ్రిని ధిక్కరించలేకుండా వున్నాడు. తనకోసమే తల్లిజీవించివుందని అతనికి బాగాతెలుసు కాని తండ్రిచేష్టలు చూస్తుంటే అతనికి పిచ్చెక్కిపోతుంది. అసలేఆ పీసులోబోలెడంతపని, తీరా ఇంటికొచ్చేసరికి ఈరాద్ధాంతం. అతనికి మనస్థిమితం లేకుండాపోయింది. ఎప్పుడో ఒకప్పుడుఆఫీసునించి ఇంటికొచ్చేటప్పటికి తల్లిశవం చూస్తానేమోఅన్న భయంనిత్యంఅతన్ని బాధిస్తూనేవుండేది.

గోడవెనకాలేనుంచుని అన్నీచూస్తున్నా బయటపడితే రసాభాస్సై తల్లిపీక ఎక్కడ నొక్కేస్తాడోఅన్న భయంతో అలాగే ఓపికపట్టి తండ్రివెళిపోగానేవచ్చి తల్లిని లేవదీసి ఓదారుస్తాడు.

"నేనీఇంట్లో లేకుండా వుంటే నిన్నుబాగా చూస్తాడేమోనే

నాడబ్బుకోసరం నిన్నుబాధపెడుతున్నాడు- కావాలంటేనేను ఇవ్వనూ- ఇవ్వటికి మూడువేలదాకా ఇచ్చానే- ఈ గోడవలేకుండా నాజీతం అంతా పట్టుకుపొమ్మను- నిన్నూ నన్నూస్థిమితంగావదిలేస్తే అదేచాలు, అసలు నాతోగాని ఈ గొడవలేలమ్మా" అంటాడు.

మాటలన్నీవిని సీతమ్మ కొడుకుని కౌగలించుకుని ఏడుస్తుంది-

'నాకు ఈఇంట్లోవున్నదీపం నువ్వేనాయనా! నిన్నుచూసే బతుకున్నాను'

గోపీకి దుఃఖంముంచుకవస్తుంది- తల్లికళ్లలో నీళ్లూ, ఆరేగినజుట్టూ చూస్తుంటే తనుఎక్కడో అధఃపాతాళంలోకి కృంగిపోతున్నట్టనిపిస్తుంది-

అలాగేఏదో నాలుగుమెతుకులుతిని గోపీఆఫీసుకు వెళిపోతాడు-

మళ్లీకొడుకు వచ్చేదాకా దుఃఖభారంతో ఎక్కడో ఒకమూల కూలిపడిపోయి వుంటుంది తల్లి-

అలా ఆపూట గడిచిపోతుంది

మళ్లారాత్రి- చుట్టు చీకటిగానే వుంటుంది- ఎక్కడాఎవరూ వుండరు- నిద్రగన్నేరు చెట్టుకింద యధాప్రకారం ఆ వ్యక్తిమాత్రం నుంచుని వుంటాడు-